

భజేహం.. భవోహం

- శ్రీకాళహస్తిలో వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- ముక్కంటి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు
- విశిష్ట వాహనాలపై ఊరేగిన ఆదిదంపతులు
- శివనామస్మరణతో మార్మోగిన దక్షిణ కైలాసం

హర హర మహాదేవ.. శంభో శంకర.. నమో పార్వతీపతయే నమః.. ముక్కంటీశా పాహిమాం.. పరమేశ్వరా రక్షమాం.. ఓం నమఃశ్శివాయ అంటూ ఆదిదేవుని స్మరిస్తూ భక్తులు తన్మయత్వం చెందారు. మహిమాన్విత వాయులింగేశ్వరుని దివ్యతేజస్సును వీక్షించి పులకించారు. ఆదిమధ్యాంత రహితుని ఆత్మలింగ దర్శనంతో పునీతులయ్యారు. నిజరూపంతో సాక్షాత్కరించిన నీలకంఠుని సేవించుకుని తరించారు. ఇంద్ర విమానంపై ఊరేగుతున్న కైలాసనాథునికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. అత్యంత ప్రీతిపాత్రమై నంది వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరిస్తున్న లయకారుని మనసారా స్తుతిస్తూ పరవశించారు. పవిత్ర లింగోద్భవ కాలంలో త్రినేత్రుని తేజోవిరాజిత మూర్తిని దర్శించుకుని కోటి జన్మల పుణ్యఫలం పొందారు.

శ్రీకాళహస్తి : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం శ్రీకాళహస్తి క్షేత్రం శివనామ స్మరణతో మార్మోగింది. వాయులింగేశ్వరుడు నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు ఉదయం ప్రథమ, ద్వితీయ కాలాభిషేకాలు జరిపించారు. అలాగే ఉచ్ఛికాలాభిషేకం, సాయంత్రం ప్రదోష కాలాభిషేకం చేపట్టారు. పర్వదినం సందర్భంగా మొత్తం 9 విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈక్రమంలోనే మహాశివరాత్రిని పురస్కరించుకుని వేకువజామున 2గంటలకే మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ ఆలయ అర్చకులు పవిత్ర మంత్రోచ్చారణ చేస్తూ స్వామి, అమ్మవార్లను మేల్కొలిపారు. అనంతరం గోపూజ చేశారు. 3 గంటల నుంచి భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. ఉదయం 5 నుంచి 10.30 గంటల మధ్య స్వామి అమ్మవార్లకు అర్చకులు శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించారు.

ఇబ్బందులు లేకుండా..

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహాలఘు దర్శనం అమలు చేయడంతో భక్తులు సులభతరంగా స్వామి, అమ్మవార్లను సేవించుకునే వెసులుబాటు ఏర్పడింది. క్యూలను విభజించి పకడ్బందీగా నిర్వహించడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తనివితీరు ముక్కంటీశుని దర్శించుకునే అవకాశం కలిగింది. ఈ మేరకు సుమారు 1.5లక్షల మంది భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అయినప్పటికీ ఎక్కడా అవాంఛనీయ ఘటనలు తలెత్తలేదని వివరించారు.

ఇంద్ర విమానంపై ముక్కంటి రాజసం

మహాశివరాత్రి పర్వదినాన శ్రీకాళహస్తీశ్వరస్వామి ఇంద్రవిమానంపై పురవీధుల్లో ఊరేగారు. జ్ఞానప్రసూనాంబ అమ్మవారు చప్పరంపై కొలువుదీరి అనుసరించారు. మూషిక వాహనంపై వినాయకుడు, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప చప్పరాలపై ఊరేగింపులో ముందుకు సాగారు. స్వామి అమ్మవార్లను దర్శించుకోవడానికి భక్తులతో నాలుగు మాడవీధులు కిక్కిరిసిపోయాయి. కళాకారులు పలు కళారూపాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈఓ బాపిరెడ్డి పాల్గొన్నారు.

నేడు రథోత్సవం, తెప్పోత్సవం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు మహోత్సవం ప్రారంభించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశఋారు. అలాగే రాత్రి నారద పుష్కరిణిలో శివపార్వతులు తెప్పలపై విహరించనున్నారు. ఈ మమేరకు పుష్కరిణిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.



ఇంద్ర విమానం, చప్పరంపై ఊరేగుతున్న ఆదిదంపతులు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

కనులపండువగా నంది సేవ



నంది, సింహ వాహనాలపై ఊరేగుతున్న ఆది దంపతులు

వాయులింగ స్వరూపుడైన శ్రీకాళహస్తీశ్వర స్వామివారు బుధవారం రాత్రి నంది వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వర్ణాభరణాలాంకరణలో దేదీప్యంగా ప్రకాశిస్తూ జ్ఞానప్రసూనాంబ అమ్మవారు సింహవాహనంపై మాడవీధుల్లో ఊరేగారు. నంది సేవలో కేరళ పంచ వాయిద్యాలు, భక్తి సంకీర్తనలు, భజనలు, కోలాటాలు అలరించాయి.

ముక్కంటి సేవలో 'కన్నప్ప' బృందం



మోహన్‌బాబు, మంచు విష్ణు, ప్రభుదేవా తదితరులు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం కన్నప్ప చిత్ర బృందం జ్ఞానప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంచు మోహన్‌బాబు, మంచు విష్ణు, ప్రభుదేవా, శివబాలాజీ తదితరులు దక్షిణామూర్తి సన్నిధి వద్ద కన్నప్ప బుక్‌లెట్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎంజీఎం అధినేత గుడ్లూరు మల్లికార్జుననాయుడు, డైరెక్టర్ మయూర్ పాల్గొన్నారు.

కిక్కిరిసిన దక్షిణ కైలాసం



ముక్కంటి దర్శనానికి క్యూలో వెళుతున్న భక్తులు

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని దక్షిణ కైలాసానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ మేరకు శ్రీకాళహస్తి వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే ఆదిదంపతుల దర్శనానికి భక్తులు బారులుతీరారు. రాజగోపురం సమీపం నుంచి ఉచిత దర్శనానికి క్యూలు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న నేపథ్యంలో మహా లఘుదర్శనం అమలు చేశారు. ప్రత్యేక దర్శనం కోసం మరోగోపురం నుంచి భక్తులను అనుమతించారు. ఆలయం నుంచి బయటకు వెళ్లేందుకు స్ఫటిక లింగం పక్కనుంచి ప్రత్యేక మార్గం ఏర్పాటు చేశారు.

సామాన్య భక్తుల ఇక్కట్లు

ముక్కంటి దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలను చూసి కంగారు పడ్డారు. సామాన్య భక్తులకు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. ఎమర్జెన్సీ దారులు లేకపోవడంతో గంటలు తరబడి వేచి ఉన్న మహిళలు బాత్‌రూమ్‌కు వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. దాదాపు 1.5 లక్షల మంది వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేసినా, అర్ధరాత్రి వరకు 60 వేల మంది భక్తులు మాత్రమే స్వామి, అమ్మవార్లను దర్శించుకోవడం గమనార్హం. అయినప్పటికీ చిన్నపాటి తోపులాటలు, భక్తులు అధికారుల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకోవడంతో గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. మదర్ ఫీడింగ్ కోసం ఎటువంటి ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

ట్రాఫిక్ కష్టాలు

వాహనాలను వంతెనకు అవతలే నిలిపేశారు. అయినప్పటికీ ప్రోటోకాల్ పేరుతో వీఐపీల వాహనాలు ఆలయ నాలుగో గేటు వరకు వచ్చాయి. దీంతో పలు చోట్ల ట్రాఫిక్ కష్టాలు ఏర్పడ్డాయి.

అలంకరణపై విమర్శలు

గతంలో మహాశివరాత్రి రోజున పండ్లు ,పూలతో ఆలయంలో అలంకరణ చేసేవారు. అయితే ప్రస్తుతం పూలతో మాత్రమే డెకరేషన్ చేశారు. అవి కూడా వాడిపోయి ఉండడంతో భక్తుల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి.

తమ్ముళ్ల చేతులమీదుగా ప్రసాదాలు

ఆలయం తరఫున పసుపు, కుంకుమతోపాటు ప్రసాదాలను పంపిణీ చేశారు. అయితే టీడీపీ నేతల చేతులమీదుగా భక్తులకు అందించడం సరికాదని పలువురు మండిపడ్డారు.



ముక్కంటి సన్నిధిలో అలంకరణ



ప్రసాద వితరణ చేస్తున్న మహిళలు



ఆలయంలో విశేషాలంకరణ

న్యూస్‌రీల్

రేపు తిరుపతిలో జాబ్ మేళా

తిరుపతి అర్బన్ : తిరుపతి నగరంలోని నాక్ ట్రైనింగ్ సెంటర్‌లో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పదోతరగతితోపాటు ఇంటర్, ఏదైనా డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ ఉత్తీర్ణులైన యువతీ యువకులు మేళాకు హాజరుకావచ్చని చెప్పారు. ఆసక్తిగలవారు ఆధార్ కార్డుతోపాటు విద్యార్హత సర్టిఫికెట్లు తీసుకుని రావాలని సూచించారు. ఈ మేరకు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఇతర వివరాల కోసం 9703437472,9988853335 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రాణదాన ట్రస్ట్‌కు భారీగా విరాళాలు

తిరుమల : టీటీడీ ప్రాణదాన ట్రస్ట్‌కు బుధవారం రూ.81 లక్షలు విరాళంగా అందాయి. చెన్నైకు చెందిన యాక్సెస్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.70 లక్షల విరాళం అందించింది. వర ఫ్యూచర్ ఎల్ఎల్పీ అనే సంస్థ రూ.11 లక్షలు అందజేసింది. దాతలు ఈ మేరకు చెక్‌లను టీటీడీ అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరికి తిరుమలలోని క్యాంపు కార్యాలయంలో అందించారు.

పక్షుల కేంద్రంలో రైల్వే డీఆర్ఎం



పక్షులను ఫొటో తీస్తున్న డీఆర్ఎం నరేంద్ర

దొరవారిసత్రం : నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని బుధవారం విజయవాడ డివిజన్ డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ సందర్శించారు. కడప చెట్లపై విడిది చేసిన విహంగాల విన్యాసాలను కెమెరాతో చిత్రీకరించారు. ఈ సందర్భంగా నేచర్ గైడ్ హుస్సేనయ్య మాట్లాడుతూ పక్షుల జీవన విధానాలను వివరించారు.

ఆదిలక్ష్మికి కాసులహారం



అర్చకుడికి హారం అందిస్తున్న దాతలు

రాపూరు : పెంచలకోనలోని నృసింహుని ఆలయంలో ఆదిలక్ష్మీదేవికి బుధవారం బంగారు కాసుల హారాన్ని దాతలు బహూకరించినట్లు అధికారులు తెలిపారు. వారు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం లింగాలవలన గ్రామానికి చెందిన గురుబెల్లి లక్ష్మీనారాయణ, చైతన్య దంపతులు 39 గ్రాముల బంగారు కాసుల హారాన్ని అందించినట్లు వివరించారు.

తిరుమల నాగతీర్థంలో ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో శివుడు

తిరుమల: తిరుమలలోని నాగతీర్థంలో కొలువైన పరమశివుడికి బుధవారం మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విశేష ప్రసాదాలను సమర్పించారు. ఈ క్రమంలోనే ఆదిదేవును దర్శనార్థం విచ్చేసిన భక్తులకు అన్నదానం చేపట్టారు. సుమారు వెయ్యిమందికి అన్నప్రసాదాలు అందించినట్టు స్థానిక భక్తులకు అనిల్ తెలిపారు.

వివాదాలకు కేరాఫ్ వెటర్నరీ

- వర్సిటీలో స్తంభించిన పాలన
- 24రోజులుగా తరగతులకు హాజరుకాని విద్యార్థులు
- సమ్మె విరమణ ససేమిరా అంటున్న జూడాలు

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో పాలన అస్తవ్యస్తంగా మారింది. గత ఏడు నెలలుగా వర్సిటీలో అధికారులు తీసుకుంటున్న ప్రతి నిర్ణయం వివాదాస్పదంగా మారుతోంది. ప్రధానంగా రాష్ట్ర వ్యాప్తంగా వర్సిటీ అనుబంధంగా నడుస్తున్న పశువైద్య కళాశాలల్లో అధ్యాపకుల బదిలీలు నిర్వహించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. గరివిడి కళాశాలను కేంద్ర బృందం తనిఖీ చేసిన సమయంలో వర్సిటీ అధికారుల హడావుడి బదిలీలపై ఆరోపణలు వినిపించాయి. అలాగే వర్సిటీ ఆవరణలోని మహిళ, పురుషుల వసతి గృహాలలో మౌలిక సదుపాయలు లేకపోవడం, నాసిరకం భోజనం అందించడంతో విద్యార్థులతు మెరుపు సమ్మెకు దిగిన సంఘటనలు కోకొల్లలు. అలాగే ఔట్‌సోర్సింగ్, వర్క్ కాంట్రాక్ట్ సమస్యలను పరిష్కరించకపోవడంతో వర్సిటీ పరిపాలనా భవనం ఎదుట ఉద్యోగులు పలు మార్లు నిరసన తెలిపారు. నూతన రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన వ్యక్తి కనీసం నెల రోజులు గడవకుండానే దీర్ఘకాలిక లీవులో ఉండడం వంటి ఎన్నో సమస్యలు వర్సిటీని వేధిస్తున్నాయి. కానీ, అధికారులు అవేమీ తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తూ గ్రూపు రాజకీయాలను నడుపుతూ పబ్బం గడుపుతన్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల వ్యవహారశైలిపై వర్సిటీలో పనిచేస్తున్న అధ్యాపకులు, ఉద్యోగులు బహిరంగంగానే చర్చించుకుంటూ ఉండడం గమనార్హం.



నిరసన తెలుపుతున్న పశు వైద్య విద్యార్థులు

తరగతుల బహిష్కరణ..పట్టించుకోని అధికారులు

వెటర్నరీ వర్సిటీలో పశువైద్య విద్యార్థులు తమ గౌరవ వేతనం పెంచాలని గత 24 రోజులుగా తరగతులను బహిష్కరించారు. రోడ్డెక్కి సమ్మెకు దిగారు. అయినప్పటికీ వర్సిటీ అధికారుల్లో చలనం లేకపోవడంపై విద్యార్థులు మండిపడుతున్నారు. ఇప్పటికే సీఎంతో పాటు పలువురు మంత్రులను నేరుగా కలసి తమ గోడును విన్నవించుకున్నా స్పందన కరువైందని వెటర్నరీ జూడాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా సమ్మె విరమించాలని అధికార పార్టీకి చెందిన విద్యార్థి సంఘాల నేతలతో ఒత్తిడి చేయిస్తుండడంపై మండిపడుతున్నారు. తమ ఆందోళనను నిర్వీర్యం చేసేందుకు వర్సిటీ అధికారులు కుట్రలు పన్నుతున్నారని వాపోతున్నారు. గౌరవ వేతనం పెంచే వరకు నిరసన కొనసాగుతుందని, అడ్డుకునేందుకు యత్నిస్తే ప్రాణ త్యాగానికైనా సిద్ధమని హెచ్చరిస్తున్నారు.

పశువైద్య విద్యార్థుల గౌరవ వేతనం వివరాలు		ప్రస్తుతం విద్యార్థుల డిమాండ్	
బీవీఎస్సీ	7వేలు	బీవీఎస్సీ	25వేలు
ఎంవీఎస్సీ	10వేలు	ఎంవీఎస్సీ	50వేలు
పీహెచ్‌డీ	12వేలు	పీహెచ్‌డీ	75వేలు

ఆరోపణలు సత్యదూరం



"వెటర్నరీ విద్యార్థులు కొంతకాలంగా సమ్మెలో ఉన్నారు. వారి సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. సమస్యపై చర్చిస్తున్నాం.విద్యాసంవత్సరం ముగింపు దశలో ఇలా విలువైన సమయాన్ని వృథా చేసుకోవడం సరికాదు. వెంటనే తరగతులకు హాజరుకావాలి. వర్సిటీలో పాలన సజావుగా సాగుతోంది. రాజకీయాలు, వివాదాలంటూ వస్తున్న ఆరోపణలు సత్యదూరం. విద్యార్థుల శ్రేయస్సు, వర్సిటీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– జీవీ రమణ, ఇన్‌చార్జి వీసీ, ఎస్వీ వెటర్నరీ వర్సిటీ

క్లుప్తంగా

ప్రజాసేవే పరమావధిగా వైద్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ ఆర్‌వీ కుమార్ తదితరులు

తిరుపతి కల్చరల్ : ప్రజాసేవే పరమావధిగా స్విమ్స్‌లో వైద్యం అందిస్తున్నట్లు ఆస్పత్రి డైరెక్టర్ ఆర్‌వీ కుమార్ తెలిపారు. బుధవారం తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో స్విమ్స్ 32వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఆర్‌వీ కుమార్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు సైతం డబ్బుకు ప్రాధాన్యమివ్వకుండా పేదలకు సేవలందించడానికే తమ భవిష్యత్‌ను అంకితం చేయాలని పిలుపునిచ్చారు. రాయలసీమకే తలమానికంగా లక్షలాది మంది ప్రాణాలను కాపాడుతూ మెరుగైన వైద్యం అందిస్తున్న స్విమ్స్ 32వ వార్షికోత్సవం జరుపుకోవడం సంతోషకరమన్నారు. ఒకే రోజు మూడు రకాల కీలకమైన ట్రాన్స్ ప్లాంటేషన్లు చేయడం దేశంలో ఎక్కడా జరగలేదని, ఈ ఘనత స్విమ్స్‌కే దక్కిందని వెల్లడించారు. ఇక్కడి వైద్యులు ఎక్కువ డబ్బు ఆర్జించే నైపుణ్యం, శక్తి ఉన్నప్పటికీ శ్రీవారి సంస్థలో పనిచేయడం గౌరవంగా భావిస్తున్నారని వివరించారు. స్విమ్స్ అభివృద్ధికి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ శ్యామలరావు సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. ఆస్పత్రి అభ్యున్నతే లక్ష్యంగా ఐఐటీ, ఐజర్, అరవింద ఐ హాస్పిటల్, తిరుపతిలోని అన్ని యూనివర్సిటీలతో ఎంఓయూలు కుదుర్చుకున్నట్లు చెప్పారు. అలాగే యునైటెడ్ కింగ్డమ్(యూకే) వారితో స్టూడెంట్స్ ఎక్స్‌చేంజ్ ప్రోగ్రామ్ కుదుర్చుకున్నట్లు వివరించారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ చాటిన ఏడుగురు వైద్యులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు. వివిధ క్రీడా పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ, డాక్టర్ అల్లాడి మోహన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ,పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషా కళావత్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ వనజాక్షమ్మ పాల్గొన్నారు

ఆకట్టుకుంటున్న మృత్తిక శివలింగం



తిరుపతి రూరల్ : తిరుచానూరు నుంచి కొత్త మంగళం వెళ్లే మార్గంలో స్వర్ణముఖి నదీ తీరాన ఏకవీర ఫౌండేషన్, సురభి గో సంరక్షణశాల ఆధ్వర్యంలో బుధవారం మహా శివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామి స్వహస్తాలతో తయారు చేసిన మృత్తిక శివలింగం (మట్టితో తయారు చేసిన శివలింగం) భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. లింగోద్భవ సమయంలో బిందెలతో నీళ్లు పోసినప్పటికీ శివలింగం ప్రతిమ చెక్కు చెదరదని చెప్పడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ క్రమంలోనే ఉత్సవాల్లో చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆటలు

విద్యార్థులు చదివింది తిరుపతి జిల్లాలో.. పరీక్షలు రాయబోయేది చిత్తూరు జిల్లాలో ఇదేమి వింత ధోరణి అని విద్యార్థి సంఘాలు మండి పడుతున్నాయి. మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు తిరుపతి జిల్లాకు చెందిన 84 మంది విద్యార్థులు చిత్తూరు జిల్లా కేంద్రానికి విచ్చేసి పరీక్షలు రాయనున్నారు. విద్యావ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన కూటమి అలసత్వంతో ఇలాంటి అవస్థలు ఎదురవుతున్నాయని తల్లిదండ్రులు, విద్యావేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- తిరుపతి విద్యార్థులకు చిత్తూరులో పరీక్ష
- కూటమి పాలనలో ఇంటర్ విద్యార్థులకు వింత అనుభవం
- ప్రైవేట్ కళాశాల నిర్వాకంతో విద్యార్థుల అవస్థలు
- అనుమతి లేని కళాశాలల నిర్వహణతోనే ఈ పరిస్థితి

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ అధికారుల నుంచి అనుమతి లేకుండా తిరుపతి జిల్లా బైరాగి పట్టెడలో ఎస్ఎస్ఆర్ అనే కళాశాల 2024–2025 విద్యాసంవత్సరంలో నిర్వహించారు. తిరుపతిలో కళాశాల నిర్వహిస్తున్న నిర్వాహకుడు ఓంప్రకాష్ చిత్తూరు జిల్లా పెనుమూరుకు చెందిన ఎస్వీ కళాశాల కరస్పాండెంట్ నుంచి కళాశాలను కొనుగోలు చేసుకున్నారు. కొనుగోలు చేసుకున్న తిరుపతి నిర్వాహకుడు ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అన్ని అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అయితే అలా తీసుకోకుండా ప్రస్తుత విద్యాసంవత్సరం అం



తా తిరుపతిలో కళాశాలను నిర్వహించారు. ఈ వ్యవహారం పలుమార్లు అక్కడి విద్యార్థి సంఘాలు తిరుపతి ఇంటర్మీడియట్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఆ తర్వాత తిరుపతి ఎస్ఎస్ఆర్ కళాశాలను సందర్శించిన ఇంటర్మీడియట్ అధికారులు అప్పట్లోనే కళాశాలను సీజ్ చేసి ఉంటే ఎలాంటి సమస్యలు ఉండేవి కావు. అలా చేయకుండా ఎస్ఎస్ఆర్ కళాశాల నిర్వాహకుడికి అనుకూలంగా ఇంటర్మీడియట్ అధికారులు వ్యవహరించారు. ఈ సమస్య జఠిలమై పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లు వచ్చే సరికి 84 మంది విద్యార్థుల భవిష్యత్‌కు అంధకారంలోకి వెళ్లేలా చేసింది.

విద్యార్థులకు అగచాట్లు

ఈ వ్యవహారంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలేమో సాఫీగా ఉంటున్నాయి. చివరికి 84 మంది విద్యార్థులు మాత్రం అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇటీవల ఆ విద్యార్థుల హాల్‌టికెట్లు జారీ కాకపోవడంతో సమస్య తీవ్రం అయింది. చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీకి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందడంతో విచారణ నిర్వహించారు. పెనుమూరు కళాశాలకు నోటీసులు జారీ చేశారు. ఆ తర్వాత క్షుణ్ణంగా విచారణ చేసిన అనంతరం రాష్ట్ర ఇంటర్మీడియట్ అధికారులకు విచారణ నివేదికలను పంపారు. తిరుపతి జిల్లాకు చెందిన 84 మంది విద్యార్థుల వివరాలు పెనుమూరు ఎస్వీ జూనియర్ కళాశాల లాగిన్‌లోనే నమోదయ్యారు. దీంతో వారందరినీ చిత్తూరు జిల్లాలో చదివినట్లుగానే పరిగణించాల్సి వచ్చింది.

84 మంది విద్యార్థులకు చిత్తూరులోనే కేంద్రాలు..

ఈ విషయంపై రాష్ట్ర ఇంటర్మీడియట్ అధికారులు ఒక నిర్ణయానికి వచ్చి విద్యార్థులకు అన్యాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. 84 మంది విద్యార్థులకు పరీక్షలు ఎలా రాయించాలనే విషయంపై చిత్తూరు డీవీఈఓ సయ్యద్ మౌలాతో సంప్రదింపులు జరిపారు. తిరుపతి జిల్లాలో పరీక్ష కేంద్రాలు కేటాయించాలంటే ఎస్ఎస్ఆర్ కళాశాలకు అనుమతి లేదు. దీంతో విద్యార్థుల వివరాలు పెనుమూరు మండలం ఎస్వీ కళాశాల లాగిన్‌లోనే ఉండడంతో చిత్తూరు జిల్లాలోనే పరీక్ష కేంద్రాలు కేటాయించారు. పరీక్ష ఫీజుకు అదనంగా జరిమానా విధించి తత్కాల్ విధానంలో ఎస్వీ కళాశాల నిర్వాహకుడు ఫీజు చెల్లించాలని ఆదేశించారు. ఎస్వీ కళాశాల నిర్వాహకుడు జరిమానాతో 84 మంది విద్యార్థుల ఫీజులు ఆన్‌లైన్‌లో చెల్లించారు. దీంతో ఆ విద్యార్థులకు చిత్తూరు జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను కేటాయించారు. చివరికి మార్చి 1వ తేదీ నుంచి తిరుపతి జిల్లా నుంచి చిత్తూరుకు వచ్చి విద్యార్థులు పరీక్షలు రాయాల్సి వస్తోంది.

గుడిమల్లం ఆలయంలో తొక్కిసలాట



గేట్లు తోసుకుని వెళుతున్న టీడీపీ నేత

- వీఐపీల సేవలో కూటమి నేతలు
- చేతులెత్తేసిన అధికారులు
- దర్శనానికి గంటల తరబడి నిరీక్షించిన సామాన్య భక్తులు



పరశురామేశ్వరాలయంలో కిక్కిరిసిన భక్తులు

ఏర్పేడు(రేణిగుంట) : ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన భారతదేశపు తొలి శైవక్షేత్రం పరశురామేశ్వరాలయంలో బుధవారం మహాశివరాత్రి సందర్భంగా ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం కాసేపు సజావుగా భక్తులు దర్శించుకున్నారు. ఇంతలో టీడీపీ నేతలు రంగ ప్రవేశం చేసి తమ కుటుంబ సభ్యులు, బంధువులను ప్రత్యేక ద్వారం ద్వారా తీసుకెళ్లి దర్శనాలు చేయించుకున్నారు. ఈ క్రమంలో సామాన్య భక్తులు, చంటిబిడ్డల తల్లులు గంటల తరబడి క్యూలో నిలిచిపో



డీఎస్పీ శ్రీనివాసరావును నిలదీస్తున్న భక్తులు

యారు.

అధికారులు విఫలం

ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి ఉత్సవాల నిర్వహణలో పూర్తిగా విఫలమయ్యారు. అతిపురాతన శివాలయంగా పేరుగాంచిన ఈ ఆలయ దర్శనార్థం ఇతర రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. వారికి కనీస సదుపాయాలను కూడా కల్పించకుండా భక్తుల సహనాన్ని ఈఓ పరీక్షించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు పెత్తనం తన చేతిలోకి తీసుకుని వీఐపీల సేవలో తరిస్తూ, సామాన్య భక్తులను ఇబ్బందిపెట్టారు. దీంతో పోలీసులకు, భక్తులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా క్యూలో తోపులాటలు మొదలై మహిళలు కింద పడ్డారు. దీంతో ఆలయంలో గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. గత ఏడాది ఎంతో సవ్యంగా ఏర్పాట్లు చేశారని, అయితే ఈ సారి సామాన్య భక్తులను పూర్తిగా విస్మరించారని పలువురు మండిపడ్డారు.

తలకోనలో పోటెత్తిన భక్త జనం



సిద్ధేశ్వరుని సేవలో పెద్దిరెడ్డి, చెవిరెడ్డి కుటుంబ సభ్యులు



విశేషాలంకరణలో స్వామి, అమ్మవారు

తలకోన(భాకరాపేట): మహా శివరాత్రిని పురస్కరించుకుని తలకోనకు బుధవారం ఉదయమే భక్తులు పోటెత్తారు. వేకువజామున సిద్ధేశ్వరి సమేత శ్రీసిద్ధేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం చేసి, భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ క్రమంలోనే తలకోన ఝరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఆదిదంపతులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఆదిదంపతుల సేవలో పెద్దిరెడ్డి

తలకోన బ్రహ్మోత్సవాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆదిదంపతులను దర్శించుకున్నారు.

పట్టువస్త్రాల సమర్పణ

సిద్ధేశ్వరి సమేత శ్రీ సిద్ధేశ్వర స్వామికి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయన మాట్లాడుతూ పరమేశ్వరుని సేవలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని మహాదేవుని ప్రార్థించినట్లు వెల్లడించారు.

శివాలయాలకు చెవిరెడ్డి సారె

తిరుపతి రూరల్ : తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం నుంచి మహాశివరాత్రి పర్వదినాన చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రముఖ శైవాలయాలకు సారెను సమర్పించడం ఆనవాయితీ. అందులో భాగంగా బుధవారం తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఆధ్వర్యంలో 19 శివాలయాలకు సారె సమర్పించారు. ఆయా గ్రామాల్లోని పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. ఈ క్రమంలో ఉదయం 4.30గంటలకు తుమ్మలగుంట నుంచి తలకోనకు చేరుకున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సారె సమర్పించారు. అనంతరం చంద్రగిరి మండలంలోని శేషాపురం, చంద్రగిరి, రాయలపురం, తొండవాడ, మల్లయ్యపల్లెలోని శివాలయాలకు సారె అందజేశారు.



యోగిమల్లవరంలోని శివాలయానికి సారె తీసుకువస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్ మండలంలోని పైడిపల్లి, గొల్లపల్లి, చిగురు వాడ, దుర్గసముద్రం, అడపారెడ్డి పల్లి, అవిలాల, సాయినగర్, యోగిమల్లవరం, మంగళం, రామచంద్రాపురం మండలంలోని బొప్పరాజుపల్లి, రేకలచేను, రాయలచెరువు కట్ట వద్ద శివాలయాలకు సారెను అందించారు.

ఎస్వీయూలో బది'లీల" పర్వం!



ఎస్వీయూ పరిపాలన భవనం

తిరుపతి సిటీ : ఎస్వీయూలో అంతర్గత బదిలీల పర్వం మరో సారి ప్రారంభంకానునట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆగమేఘాల మీద సుమారు 120మంది ఉద్యోగులను బదిలీ చేశారు. అర్హతలను తుంగలోతొక్కి కనీస పరిజ్ఞానం లేని విభాగాలకు సైతం కొందరు ఉద్యోగులను ట్రాన్స్‌ఫర్ చేసేశారు. ఎస్వీయూ చరిత్రలో ఇంత భారీగా అంతర్గత బదిలీలు జరిగిన దాఖలాలు లేవని పలువురు ఉద్యోగులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం రెండో విడత బదిలీ ప్రక్రియకు అధికారులు ఆమోద ముద్ర వేసినట్లు తెలుస్తోంది. ఇందులో సుమారు 65 నుంచి 100మంది ఉద్యోగులపై బదిలీ వేటు పడనున్నట్లు సమాచారం. ఇప్పటికే వర్సిటీ అధికారులు ప్రక్రియను పూర్తి చేసి జాబితాను సిద్ధంగా ఉంచినట్లు విశ్వసనీయంగా తెలిసింది. బదిలీ ఉత్తర్వులు ఏసమయంలోనైనా ఉద్యోగులకు అందే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

ఎగ్జామినేషన్ సెక్షన్ నుంచే..

ఎస్వీయూలోని పరీక్షల విభాగంపై పడిన మచ్చను తొలగించేందుకు అధికారులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఈ విభాగంలో అవినీతి రాజ్యమేలుతుండడం, రెడ్‌హ్యాండెడ్‌గా ఓ ఉద్యోగి విచారణ కమిటీకి చిక్కడంతో అతడిని అప్పటికప్పుడు సెక్యూరిటీ వింగ్‌కు బదిలీ చేశారు. మరికొందరిని గుర్తించి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. దీంతో పరీక్ష విభాగం నుంచి పెద్ద సంఖ్యలో బదిలీలు ఉంటాయిని చర్చ జరుగుతోంది. ఆర్థికబలంతో పాటు స్థానిక నేతల ఒత్తిడితో పలువురు తమకు అనుకూలమైన విభాగాలకు బదిలీ చేయించుకుంటున్నట్లు వర్సిటీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

శాశ్వత ఉద్యోగుల నియామకంతోనే..

వర్సిటీలో ప్రధాన భూమిక పోషించే విభాగం ఎగ్జామినేషన్ సెక్షన్. అవినీతికి అడ్డాగా, ఆదాయమార్గంగా ఈ సెక్షన్‌ను కొందరు ఉద్యోగులు మార్చేశారు. ఈ క్రమంలో ఇక్కడ అవినీతిని కట్టడి చేసేందుకు శాశ్వత ఉద్యోగులను మాత్రమే నియమించాలని ఈసీ నిబంధనలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికార పార్టీ అనుచరులు, తమ విధేయులు, స్థానిక నేతల ఒత్తిడితో మరికొందరికి పరీక్షల విభాగంలో పోస్టింగ్ ఇచ్చేస్తున్నారు. దీంతో అవినీతి విపరీతంగా పెరిగిపోతోందని వర్సిటీ ఉద్యోగులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విభాగంలో శాశ్వత ఉద్యోగులను నియమిస్తే అవినీతిని కట్టడి చేయవచ్చని సూచిస్తున్నారు.

హోంమంత్రి వ్యాఖ్యలు అభ్యంతరకరం

వరదయ్యపాళెం : శాసన మండలిలో హోంమంత్రి అనిత చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్నా మండిపడ్డారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తెలుగు భాషాపై మాట్లాడే నైతిక హక్కు కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులకు లేదన్నారు. పేద పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం తొలగించేందుకు కుట్రలు చేయడం సరికాదని స్పష్టం చేశారు. పోటీ ప్రపంచంలో విద్యార్థుల నైపుణ్యతను పెంచేందుకు ఇంగ్లిష్ మీడియం అవసరమని తెలిపారు. అందుకే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుచూపుతో సర్కారు బడుల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టిందని వెల్లడించారు. దీనిపై అప్పట్లో ఎల్లో మీడియా తెలుగు భాషాను నిర్వీర్యం చేస్తున్నట్లు బురదచల్లిందని ఆరోపించారు. ఇంగ్లిష్ మీడియంపై ప్రభుత్వ విధివిధానాలను ప్రశ్నించిన ఎమ్మెల్సీ మాధవరావుపై హోంమంత్రి చేసిన ఆరోపణలు సరికాదని స్పష్టం చేశారు.



చిన్నా, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి

త్రుటిలో తప్పిన ప్రమాదం

నాయుడుపేటటౌన్ : మండలంలని తిమ్మాజికండ్రిగ సమీపంలో రహదారిపై బుధవారం ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాలు.. నాయుడుపేట నుంచి వెంకటగిరికి ప్రయాణికులతో బయలుదేరిన బస్సుకు మార్గం మధ్యలో ఎదురు వచ్చిన ట్రాక్టర్‌ను తప్పించబోయి గుంతలో ఇరుక్కుపోయింది. దీంతీ బస్సు ఒక్కసారిగా పక్కకు ఒరగడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. రోడ్డు పక్కన గ్యాస్ పైప్ లైన్ కోసం ఇష్టారాజ్యంగా గుంతలు తవ్వేశారు. ఈ క్రమంలో తరచూ పలు వాహనాలు ఈ గుంతల్లో పడి ప్రమాదానికి గురవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పూడ్చించాలని పలువురు కోరుతున్నారు.



గుంతలో కూరుకుపోయిన బస్సు

సారా నిర్మూలనపై ప్రత్యేక దృష్టి

తిరుపతి క్రైమ్ : జిల్లాలో సారా నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి శాంపిళ్లు సేకరించాలని కోరారు. ఎక్కడైన అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయిని అరికట్టేందుకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని స్పష్టం చేశారు. నవోదయం 2.0ను విజయవంతం చేయాలని చెప్పారు.

తాగుబోతు వీరంగం

తిరుపతి మంగళం రోడ్డులోని ఓ బార్ వద్ద బుధవారం ఓ తాగుబోతు వీరంగం సృష్టించాడు.వివరాలు.. చంద్రశేఖర్ రెడ్డి కాలనీకి చెందిన లోకేష్ అనే వ్యక్తి పూటుగా మద్యం తాగి నానా హంగామా చేశాడు. కానిస్టేబుళ్లు గంగాసాగర్, గోపీనాథ్ రెడ్డి అదుపు చేసేందుకు యత్నించగా తిరగబడ్డాడు. కానిస్టేబుల్ గంగాసాగర్‌పై దాడి చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ

పవిత్రం.. పునీతం

- వైభవంగా కల్యాణ వెంకన్న చక్రస్నానం
- తిరుచ్చి వాహనంపై శ్రీవారం విహారం
- ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం



స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు



చక్రస్నానం జరిపిస్తున్న వేదపండితులు

చంద్రగిరి : శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా తొమ్మిదోరోజు బుధవారం శాస్త్రోక్తంగా చక్రస్నానం జరిపించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్యాణ వెంకన్నను పల్లకిలో కొలువుదీర్చి ఊరేగించారు. అనంతరం దేవదేవేరుల ఉత్సవర్లు ఆలయ పుష్కరిణి వద్దకు చేరుకున్నారు. 9 నుంచి 10గంటల వరకు ఉత్సవర్లతో పాటు చక్రతాళ్వార్‌కు ఆలయ అర్చకులు వైఖానస ఆగమోక్తంగా ఫల,పుష్ప, సుగంధ, పన్నీటి సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజన నిర్వహించారు. స్నపన తిరుమంజనం అనంతరం 10 నుంచి 10.20 గంటల మధ్య చక్రస్నాన ఘట్టాన్ని వేడుకగా చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానమాచరించారు. సాయంత్రం శ్రీనివాసుడు సతీసమేతంగా తిరుచ్చి వాహనంపై ఆశీనులై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. 7 నుంచి 8 గంటల నడుమ అర్చకులు ఆగమోక్తంగా ధ్వజావరోహణ కార్యక్రమం చేపట్టారు. దీంతో కల్యాణ వేంకటేశ్వస్వామి బ్రహ్మోత్సవాలు పరిపూర్ణమయ్యాయి. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నారాయణవనం: మండలంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో వెత్తలతడుకు ఆదిఆంధ్రవాడకు చెందిన గోకుల్(20) మృతి చెందాడు. వివరాలు.. గోకుల్ స్కూటర్‌పై కైలాసకోనకు వెళుతుండగా లారీ ఢీకొంది. మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసును నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.



మృతి చెందిన గోకుల్

అదుపుతప్పి లారీ బోల్తా

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట మండలం పూతలపట్టు--నాయుడుపేట జాతీయ రహదారిపై మర్రిగుంట సమీపంలో బుధవారం తెల్లవారుజామున బాపట్ల నుంచి కృష్ణగిరికి వెళుతున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్పంగా గాయపడ్డారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని గాజుల మండ్యం పోలీసులు తెలిపారు.



బోల్తా పడిన లారీ

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 65,127 మంది స్వామి వారిని దర్శించుకోగా 19,307 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.29 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

పాఠశాలలో తమ్ముళ్ల రాజకీయం

వరదయ్యపాళెం : సత్యవేడు నియోజకవర్గంలోని కేవీబీపురం మండలం రాగిగుంట జెడ్పీ హైస్కూల్‌లో టీడీపీ నేతలు స్వార్థ రాజకీయాలకు తెరతీశారు. దాదాపు 16 ఏళ్లుగా అదే బడిలో మధ్యాహ్న భోజన నిర్వాహకులుగా కొనసాగుతున్న బత్తెమ్మ, మోహనమ్మ అనే మహిళలను తొలగించాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ సల్లా వాసు, స్థానిక టీడీపీ నేతలు పి. సురేష్, జి.బలరాం, మస్తాన్, శీను, చంద్ర, బాబు కలిసి కుట్రలు పన్నుతున్నట్లు బాధిత మహిళలు ఆరోపిస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నామని నెపం వేసి తమను తొలగించేందుకు యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత క్రమశిక్షణతో ఎలాంటి ఆరోపణలు లేకుండా వంట నిర్వాహకులుగా ఇదే పాఠశాలలో రాజకీయాలకు అతీతంగా కొనసాగుతుంటే టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరికాదని వాపోతున్నారు. సుమారు 6నెలలకు పైగా రూ. 2.50లక్షల మేర మధ్యాహ్న భోజన బకాయిలు రావాల్సి ఉందని, ఆ మొత్తాన్ని చెల్లిస్తే తక్షణమే తప్పుకునేందుకు సిద్ధమని నిర్వాహకులు చెబుతున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని వెల్లడించారు. సరస్వతీ నిలయంలో టీడీపీ నేతల రాజకీయాలపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రాగిగుంట జెడ్పీ హైస్కూల్